సాక్షి కర్నూలు

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



లక్ష్మమ్మవ్వ సేవలో హైకోర్టు జడ్జి

ఆదోని అర్బన్: మహాయోగి లక్ష్మమ్మవ్వను గురువారం కర్ణాటక హైకోర్టు జడ్జి శివశంకర్ అమరన్నావర్ దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళా వేదికపై భక్తి గీతాలకు కళాకారులు చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.16
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 98.424
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,258
అవుట్ ఫ్లో	: 10,159

న్యూస్‌రీల్

సహకార వ్యవస్థను బలోపేతం చేద్దాం

● సహకార వారోత్సవాల్లో జేసీ నవ్య

కర్నూలు(అగ్రికల్చర్): జవాబుదారితనంతో పనిచేసి సహకార వ్యవస్థను బలోపేతం చేద్దామని జాయింట్ కలెక్టర్, జిల్లా సహకార కేంద్రబ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్‌పర్సన్ బి.నవ్య పిలుపునిచ్చారు. రైతులు, ఇతర అన్ని వర్గాల అభ్యున్నతి, మెరుగైన సమాజ నిర్మాణంలో సహకార వ్యవస్థ భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకులో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఆమె ప్రారంభించి సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... సహకార వారోత్సవాల విశిష్టతను, ఉద్దేశాలను వివరించారు. సహకార వ్యవస్థ ద్వారా సాధించిన ప్రగతిని అన్ని వర్గాల ప్రజలకు తెలియజేసి వారిలో సహకార భావనను పెంచాలని సూచించారు. రాష్ట్ర, దేశ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార వ్యవస్థ పాత్ర చాలా ముఖ్యమైందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, కేడీసీసీబీ సీఈఓ విజయ కుమార్, జీఎం పి.రామాంజనేయులు, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఏజీఎం శ్రీనాథ్‌రెడ్డి, కో–ఆపరేటివ్ యూనియన్ ప్రతినిధి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నేడు జన జాతీయ గౌరవ దివస్

కర్నూలు (అర్బన్): గిరిజన స్వాతంత్య్ర సమర యోధుల గౌరవార్థం భగవాన్ బిర్సాముండా జయంతి సందర్భంగా ఈనెల 15న జన జాతీయ గౌరవ దివస్‌గా ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారిణి జె.రంగలక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సునయన ఆడిటోరియంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన స్వాతంత్య్ర సమరయోధులు శ్రీభగవాన్ బిర్సాముండా, అల్లూరి సీతారామరాజు, గంటం దొర, మల్లు దొర, బోనంగి పందుబద, తగ్గి వీరయ్య దొర, కుడుముల పెద్దబయన్న, హనుమంతప్ప, డిప్పల సూరన దొర సంస్మరణ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని గిరిజన వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరుకావాలని ఆమె కోరారు.

ఆర్‌యూ బీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం (ఆర్‌యూ) పరిధిలో మే నెలలో నిర్వహించిన బీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. విద్యార్థులు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 85 మందికి 79, సప్లిమెంటరీ విద్యార్థులు 16 మందికి 15 మంది ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు.

బీజేపీ రాష్ట్ర నాయకుడిపై విచారణకు ఆదేశం

కర్నూలు (టౌన్): ఓ వర్గంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నగరంలోని బీక్యాంపు, ఆరోరా నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. హరీష్‌బాబును విచారించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. 2022 జనవరి నెలలో హరీష్ బాబు ఓ వర్గంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై అప్పట్లోనే కొందరు కర్నూలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు లేకపోవడంతో ప్రభుత్వం పోలీసులకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

చదువుతోనే భవిష్యత్తు

● బాలల దినోత్సవంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్

వెల్దుర్తి(కృష్ణగిరి): బాగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అల్లుగుండు గ్రామం ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన బాలల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చదువుకోకపోవడం వల్లే గతంలో ఫ్యాక్షన్ జాడలు ఏర్పడ్డాయని, ఇప్పుడు మార్పు వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారన్నారు. అయితే, ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకొని ఆదిశగా అడుగులు వేయాలన్నారు. అల్లుగుండు గ్రామంలో 80 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలకు వస్తున్నారని, ఈ సంఖ్య మరింత పెరగాలన్నారు. బాలల రక్షణ, హక్కుల కోసం పనిచేసే వివిధ విభాగాల సిబ్బంది ఆ దిశగా పని చేయాలన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేయడంతో పాటు మంచి ప్రవర్తన, నడవడిక నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు పాల్గొన్నారు.

ప్రకృతి చోద్యం!

ఎలాంటి రసాయనాలు వాడకుండా పంటలు పండించడమే ప్రకృతి వ్యవసాయం. దీనివల్ల భూసారం పెరగడంతో పాటు రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. అంతేకాకుండా ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయి. అందువల్లే గత ప్రభుత్వాలు కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాయి. ఇందుకోసం వ్యవసాయశాఖలోనే ఒక విభాగాన్ని ఏర్పాటు చేశాయి. కానీ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం లెక్కలు ఘనంగా కనిపిస్తున్నా... క్షేత్రాలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.



ప్రకృతి వ్యవసాయం పేరుతో సాగు చేసిన పంటలు



34,024 ఎకరాలు — అధికారుల లెక్కల ప్రకారం ప్రకృతి సాగు విస్తీర్ణం

367 — ప్రకృతి సాగు విభాగంలోని సిబ్బంది

75,534 ఎకరాలు — ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం లక్ష్యం

? — ప్రస్తుతం జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు

లక్ష్యం ఘనం.. క్షేత్రంలో అంతా శూన్యం

- ప్రకృతి వ్యవసాయంపై అంతులేని నిర్లక్ష్యం
- కాకిలెక్కలతో ప్రభుత్వాన్నే బురిడీ కొట్టిస్తున్న అధికారులు
- సేంద్రియసాగు పేరుతో జిల్లాలో జోరుగా కెమికల్స్ వినియోగం

ప్రకృతి వ్యవసాయం అంటే...

ప్రకృతి వ్యవసాయం అంటే ఎలాంటి పురుగు మందులు, రసాయన ఎరువులు వాడకుండా పంటలు పండించడం. పంటల సాగులో ద్రవ, ఘన జీవామృతాన్ని మాత్రమే వినియోగించడం. చీడపీడల నివారణకు కషాయాలు, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, దశపర్ణి కషాయం తదితర వాటిని వినియోగించడం. ఏ రకంగానూ ఇటు పురుగుమందులు, అటు రసాయన ఎరువులు వినియోగించకపోవడం. అలా..వరుసగా మూడేళ్లు సాగు చేస్తే ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లుగా పరిగణిస్తారు. కానీ అధిక దిగుబడుల కోసం చాలా మంది విచ్చల విడిగా రసాయన మందులు వాడుతున్నారు.

➤ కల్లూరు మండలం లక్ష్మీపురం పంచాయతీలో 631 మంది మహిళలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఆ పంచాయతీలో ముగ్గురు మాత్రమే 100 శాతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అందుకే సర్టిఫికేషన్ కూడా ఎవరూ వెళ్లడం లేదు. అధికారులు చెబుతున్న లెక్కలన్నీ ఇలాగే ఉంటున్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయం జిల్లాలో రికార్డుల్లోనే సాగుతోంది. అధికారులు వేలాది ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుతోందని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నామమాత్రానికే పరిమితమైంది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక విభాగం ఉన్నా... ఉత్తుత్తి హడవుడే తప్ప ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ప్రకృతి వ్యవసాయం కింద జిల్లాలో సాగుచేసిన ఆహార పంటల్లో కెమికల్స్ అవశేషాలు ఉన్నట్లుగా శాస్త్రీయంగా నిర్ధారణ కావడంతో ప్రకృతి సేద్యం... అంతా చోద్యంగా మారింది.

లెక్కల్లో మాత్రం 34,024 ఎకరాల్లో...

2024–25 సంవత్సరంలో జిల్లాలోని 141 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది 53,834 మంది రైతులతో 75,534 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నది వ్యవసాయ శాఖ లక్ష్యం. ప్రకృతి వ్యవసాయ విభాగం లెక్కల ప్రకారం ఇప్పటికే 32,607 మంది రైతులు 34,024 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లుగా చెబుతున్నారు. కానీ 32,707 మంది రైతుల్లో 5 శాతం మంది కూడా ప్రకృతి వ్యవసాయం చేయడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అందువల్లే జిల్లాలో వేలాది మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు చెబుతున్నప్పటికి.. సర్టిఫికేషన్ మాత్రం అతి కొద్ది మందికే వస్తోంది. అది కూడా స్వచ్ఛందంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకే దక్కుతోంది.

సాగుకు సిబ్బంది వెనుకంజ

ప్రకృతి వ్యవసాయ విభాగంలో 367 మంది పనిచేస్తున్నారు. వాస్తవానికి వీరంతా వారికున్న భూమిలో ఎకరా, అర ఎకరా విస్తీర్ణంలో తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలి. ప్రధానంగా ఎల్–1, ఎల్–2, ఎల్–3 కేటగిరీ వరకు ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలవాలి. కానీ వీరిలోనే 60 శాతం మంది ప్రకృతి వ్యవసాయాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. రైతులకు ఆదర్శంగా ఉండాల్సిన సిబ్బందే కాడికిందపడేస్తే ఇక రైతులు ఎందుకు పట్టించుకుంటారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు కొందరు మాస్టర్ ట్రైనర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

పాలేకర్ స్ఫూర్తితో 150 మంది రైతులు..

ఎవరి ప్రమేయం లేకుండా స్వచ్ఛందగా జిల్లాలోని 150 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వీరు దాదాపు పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్నారు. వీరు సుభాష్‌పాలేకర్ స్ఫూర్తితో ప్రకృతి వ్యవసాయం చేస్తుండటం విశేషం. ప్రకృతి వ్యవసాయ విభాగం చెబుతున్న వారిలో 5 శాతం కూడ ప్రకృతి వ్యవసాయం చేసే వారు లేరు. ఈ 150 మంది రైతుల ఉత్పత్తులతోనే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హడావుడి చేస్తున్నారు.

విచ్చలవిడిగా కెమికల్స్ వాడుతున్నా.. ప్రకృతి వ్యవసాయం అంటూ నమ్మిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విచ్చల విడిగా కెమికల్స్ వాడకం

జిల్లాలో చాలా మంది పేరుకే ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఆచరణలో మాత్రం అంతా కెమికల్స్ వ్యవసాయమే. ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున జరుగుతుంటే రసాయన ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గాలి. కానీ వివిధ మండలాల్లో లెక్కకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తుండటం గమనార్హం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2.50 లక్షల టన్నుల వరకు రసాయన ఎరువుల వినియోగం ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత కర్నూలు జిల్లాలో 1.50 లక్షల టన్నుల వరకు వినియోగమవుతోంది. 2024–25 ఖరీఫ్‌లో 1,27,567.657 టన్నుల రసాయన ఎరువులను వినియోగించినట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి చూస్తే జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు.

సాగు విస్తీర్ణం పెంచుతాం

జిల్లా రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. ఆసక్తి ఉన్న వారిని గుర్తించి శిక్షణ ఇస్తున్నాం. జీవామృతం, కషాయాల తయారీపై కూడా అవగాహన కల్పిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేసే సిబ్బంది కూడ ఎకరా, అర ఎకరా విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది 54,834 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి

శ్రీమఠంలో కార్తీక త్రయోదశి

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో కార్తీక త్రయోదశి వేడుక మంగళ ప్రదంగా జరిగింది. గురువారం శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో వేడుకలు చేపట్టారు. ముందుగా తుంగభద్ర నదిలో దండోదక స్నానం గావించారు. అలాగే సంస్కృత విద్యాపీఠం విద్యార్థులకు శ్రీమన్ న్యాయసుధ గ్రంథంపై పవిత్ర నది నడిబొడ్డున పరీక్షలు నిర్వహించారు. ఆ గ్రంథంపై విద్యార్థులకు ఉన్న పరిజ్ఞానంపై పీఠాధిపతి ఆరా తీశారు. ఈ వేడుక శాస్త్రోక్తంగా జరగడం పలువురిని ఆకట్టుకుంది.



తుంగభద్రనదిలో దండోదక స్నానమాచరిస్తున్న పీఠాధిపతి

నేడు తుంగాహారతి

మండల కేంద్రంలోని తుంగభద్రనది తీరంలో శ్రీ మఠం తరపున శుక్రవారం సాయంత్రం పీఠాధిపతి సుభుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవ తుంగాహారతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

స్థానిక సంస్థలకు రూ.60 కోట్లు విడుదల

- జెడ్పీకి రూ.13.34 కోట్లు, మండలాలకు రూ.13.57 కోట్లు
- 484 గ్రామ పంచాయతీలకు రూ.33.12 కోట్లు

కర్నూలు (అర్బన్): జిల్లాలోని స్థానిక సంస్థలకు (2024–25 ఆర్థిక సంవత్సరానికి) 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు రూ.60.03 కోట్లు గురువారం విడుదలయ్యాయి. కేటాయింపుల మేరకు జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి. జిల్లా పరిషత్‌కు బేసిక్ గ్రాంట్ కింద రూ.5,33,72,556, టైడ్ గ్రాంట్ కింద మరో రూ.8,00,59,140 విడుదలైనట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 53 మండలాలకు బేసిక్ గ్రాంట్ కింద రూ.5,42,88,238, టైడ్ గ్రాంట్ కింద రూ.8,14,32,379 మేర నిధులు విడుదలయ్యాయని తెలిపారు. మండలాలకు సంబంధించి అత్యధికంగా ఆదోని మండలానికి రూ.47.99 లక్షలు, ఆ తర్వాత బనగానపల్లె మండలానికి రూ.47.18 లక్షలు విడుదలయ్యాయని జెడ్పీ సీఈఓ వెల్లడించారు. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీలకు అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.13,24,97,103, టైడ్ గ్రాంట్ కింద రూ.19,87,45,647 మేర నిధులు విడుదలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఆయా గ్రామ పంచాయతీలకు ఈ నిధులు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆటతో ఒకరు...పాటతో మరొకరు ఆకట్టుకున్నారు. ఉత్సాహంగా తమలోని ప్రతిభను చాటిచెప్పారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన అనాథ పిల్లలకు ఆటల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

- వివరాలు 8లో ▶

బాబూ.. సూపర్ సిక్స్‌కు నిధులేవీ?

- రాష్ట్ర బడ్జెట్‌లో పైసా కేటాయించకుండా దగా
- తల్లికి వందనం, నిరుద్యోగ భృతి ఊసే లేదు
- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుంది
- యురేనియంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త తరలిస్తే ప్రజా ఉద్యమం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, పార్టీ నాయకులు

కర్నూలు (టౌన్): ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలకు నిధులు కేటాయించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను మరోసారి దగా చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీ అని మండిపడ్డారు. గురువారం సాయంత్రం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏ పథకానికి నిధులు కేటాయించలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చెప్పిన ప్రతి హామీని పక్కాగా అమలు చేయడమే కాక ప్రతి పథకం ప్రయోజనం లబ్ధిదారుడి ఖాతాలో జమ చేశామని గుర్తు చేశారు. ప్రస్తుత సర్కారు రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పిందన్నారు. అయితే, బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదన్నారు. అలాగే 3 గ్యాస్ సిలిండర్లకు రూ. 4 వేల కోట్లు అవసరం కాగా కేవలం రూ. 890 కోట్లు కేటాయించిందన్నారు. దీని అర్థం మిలిగిన రెండు సిలిండర్లు ఎత్తేసినట్లు కాదా అని ప్రశ్నించారు. మంత్రి రామనాయుడు ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం అన్నారు. బడ్జెట్‌లో ఆ ఊసేలేదన్నారు. నిరుద్యోగ భృతి కూడా అంతే అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అదిగో ఇదిగో ఉచిత బస్సు ప్రయాణం అంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేసి సర్కారు బెదిరింపులకు దిగుతుందని, వారికి అన్ని విధాలుగా పార్టీ అండగా నిలుస్తుందన్నారు.

➡ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేక కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్లు , రూ. 12 లక్షల కోట్లు అప్పు చేసిందని, రాష్ట్రం శ్రీలంక అవుతుందని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు వారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 6 లక్షల కోట్లే అని ప్రకటించడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదే అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు 2 డీఏ లు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క ప్రయోజనం కూడా చేకూర్చలేదన్నారు. డీఏలు లేవు, ఐఆర్‌లు లేవు అన్నారు. పీఆర్‌సీ గురించి పట్టించుకునే పరిస్థితే లేదన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చమని అడిగితే కూటమి సర్కారు కేసులు పెట్టి భయపెట్టడం సిగ్గుచేటన్నారు. జమిలీ ఎన్నికలు త్వరలోనే వస్తున్నాయని, ప్రజలు బాబుకు గుణపాఠం చెబుతారన్నారు. పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తున్న వారిని ప్రభుత్వం వేధిస్తోందన్నారు. గతంలో ఇటువంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రభుత్వానికి పాలన చేతకాక వ్యతిరేకంగా మాట్లాడి వారిపై కేసులు నమోదు చేస్తుందన్నారు.

కోర్టును ఆశ్రయిస్తాం

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం కర్నూలులో హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్తా, నేషనల్ లా యూనివర్సిటీ ఇలా ఎన్నో సంస్థలు తీసుకువస్తే వాటిని తరలించేందుకు కూటమి సర్కారు కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. రాయలసీమకు అన్యాయం చేస్తే సహించమని హెచ్చరించారు. సంస్థల తరలింపును నిలవరించేందుకు కోర్టును ఆశ్రయిస్తామన్నారు. అంతేకాకుండా రాజకీయ పార్టీలతో కలిసి ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమ సింహారెడ్డి, జుబేర్, యూనుసూ బాషా, కార్పొరేటర్లు షాషా వలి, ఆర్షియా ఫర్హీన్, నాయకులు ధనుంజయ ఆచారీ, షరీఫ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

యురేనియంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిల్లాలో జరుగుతున్న యురేనియం తవ్వకాలను నిలుపుదల చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు తెలుగు దేశం నాయకుల ఇళ్లను ముట్టడిస్తారన్నారు. బయట తిరగలేని పరిస్థితులు ఏర్పడతాయన్నారు.

108 ఉద్యోగుల సమ్మె సైరన్

కర్నూలు(హాస్పిటల్): అత్యవసర సేవలు అందించే 108 అంబులెన్స్ సర్వీస్ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25 నుంచి సమ్మెలోకి వెళ్తున్నారు. ఈ మేరకు వారు గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లకు నోటీసులు ఇచ్చారు. 108లో పనిచేస్తున్న ఈఎంటీ, పైలెట్లకు గ్రాట్యుటీ, ఎర్న్‌డ్ లీవ్ అమౌంట్, వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించాలని కోరారు. అలాగే తమను వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించి 108 సర్వీసును ప్రభుత్వమే నిర్వహించాలని, సిబ్బంది కొరత తీర్చాలని, అర్హులైన ఈఎంటీలను మెడికల్ కళాశాలల్లోని ఈఎంటీ పోస్టుల్లో నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాన్ని చెల్లించాలని, వైద్య ఆరోగ్య శాఖ నియామకాల్లో వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, రిలీవింగ్ బిల్లులు, ఎలక్ట్రికల్ బిల్లులు, వాహన మైనర్ మరమ్మతుల బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

క్లుప్తంగా

ఇద్దరిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: అనంతపురం జిల్లా ముజ్జగుబ్బ గ్రామానికి చెందిన చింతల ఆంజనేయపై ఆదోని త్రీటౌన్ పోలీసులు, మహమ్మద్ ఇస్మాయిల్‌పై వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఐటీడీపీ నాయకురాలు అంజనమ్మ, వాల్మీకి నగర్‌కు చెందిన బోయ వెంకటేష్ ఫిర్యాదు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేష్, పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రాలపై అసభ్యకరంగా, వ్యంగ్యంగా చిత్రాలు పోస్టు చేసినందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), విద్వేషాలకు గురి చేయడం చట్టం కింద వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే మహమ్మద్ ఇస్మాయిల్ ఏ ప్రాంతానికి చెందిన వారో తెలియాల్సి ఉందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుతో మహిళకు అస్వస్థత

హొళగుంద: మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం పిడుగుపాటుకు గురై కురువ అనసూయ (28) అస్వస్థతకు గురైంది. అనసూయ తన మిరప పొలంలో పని చేస్తుండగా మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభం కావడంతో అక్కడే ఉన్న ఓ చెట్టు కిందకు వెళ్లింది. కాసేపటికే కొద్ది దూరంలో పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే కుప్ప కూలిపోయింది. చుట్టు పక్క రైతులు, కుటుంభ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించి ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో చేర్పించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఓర్వకల్లు: కర్నూలు–కడప జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని శకునాల గ్రామానికి చెందిన బాలగంగాధర్‌రెడ్డి అలియాస్ బాలు(45) దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కేబుల్ కనెక్షన్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే బాలు వ్యక్తి గత పనిమీద హుసేనాపురం గ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. బైక్‌ను ఒకచోట పెట్టి రోడ్డును దాటుతుండగా కర్నూలు నుంచి చెన్నైకి వెళ్తున్న లారీ బాలును ఢీకొని కొంతదూరం ఈడ్చుకుంటూ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని అదుపులోకి తీసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య విజయలక్ష్మితోపాటు, నవీన్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



పురుగు మందుల పరిశీలిస్తున్న డీఏఓ

నంద్యాల(అర్బన్): మండలంలోని ఎరువుల దుకాణాలను గురువారం డీఏఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. శ్రీనంది ఏజెన్సీస్, గోర్ల వెంకట నారాయణశెట్టి పురుగు మందుల దుకాణాల్లో పత్రాలు, రిజిస్టర్లు, బిల్‌బుక్స్, నిల్వలను పరిశీలించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ పురుగు మందుల దుకాణదారులు రోజువారి స్టాక్ బోర్డును అప్‌డేట్ చేయాలని, స్టాక్ బుక్ నిల్వలు, గ్రౌండ్ నిల్వలు ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనుమతులు ఉన్న పురుగు మందులను మాత్రమే విక్రయించాలని, ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఏటా పురుగు మందుల లైసెన్స్‌లు, లావాదేవీల వివరాలు సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి ప్రసాదరావు ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!



నృత్యం చేస్తున్న చిన్నారి

- సాక్షి, కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అనాథాశ్రమ చిన్నారులకు ఆటల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపిన చిన్నారులు



బహుమతులు సాధించిన చిన్నారులతో కిమ్స్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ సునీల్ సేపూరి, సాక్షి బ్రాంచ్ మేనేజర్ సతీష్‌రావు, బ్యూరో ఇన్‌చార్జ్ రవివర్మ, సర్క్యులేషన్ మేనేజర్ రామిరెడ్డి తదితరులు



కర్నూలు(హాస్పిటల్): ఒకరు డ్యాన్స్‌తో అదరగొట్టగా.. మరొకరు తన పాటలతో ఆలోచింపజేశారు. మరికొందరు ఆటల పోటీల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చూపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో మానవత మహిళా విభాగం సహకారంతో గురువారం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో అనాథ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారపేటలోని సెరుడ్స్ అనాథ పిల్లల ఆశ్రమం చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని జంబో మ్యాట్ ద్వారా హాప్‌స్కాచ్, బెలూన్ గేమ్, బాల్ అండ్ బకెట్, పాట్ బ్రేకింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. మానవత మహిళా విభాగం అధ్యక్షురాలు యాని, అపర్ణ, జ్యోతిర్మయి తదితరులు చిన్నారులకు సూచనలిస్తూ ఆటలు ఆడించారు. ఏరువాకా సాగారో, దేశీకీ రంగీలా, ధన్ ధన్ దనాదన్ గీతాలకు చిన్నారులు వేసిన నృత్యాలు అలరించాయి. గణ అనే యువకుడు అనాథల జీవితాల గురించి ఆలపించిన పాట ఆలోచింపజేసింది. ముఖ్యఅతిథులు కిమ్స్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ సునీల్ సేపూరి మాట్లాడుతూ అనాథ చిన్నారులకు నేల తల్లి, ఆకాశం తండ్రి అని, పంచభూతాలే బంధువులని, తోటి పిల్లలే స్నేహితులని, ప్రతి ఒక్కరూ వారిని అక్కున చేర్చుకుంటారన్నారు. చిన్నారులు బాగా చదివి ఉత్తమ భావి భారత పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. కష్టపడితే మంచి ఫలితం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనాథలకు ఆటల పోటీలు నిర్వహించడం మంచి ఆలోచన అన్నారు. ఇలాంటి కార్యక్రమం చూడటం ఇదే మొదటిసారని కొనియాడారు. సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ ఎం.రవివర్మ మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అనాథ శరణాలయాల్లో చిన్నారులకు ఆటల పోటీలు సాక్షి యాజమాన్యం నిర్వహిస్తోందన్నారు. సమాజంలో తల్లీదండ్రులు ఉన్న పిల్లల కంటే అనాథలైన చిన్నారులకే జీవితం విలువ ఎక్కువ తెలుస్తుందన్నారు. కష్టపడకుండా ఏ ఒక్కరూ జీవితంలో పైకి ఎదగలేరన్నారు. అన్ని సౌకర్యాలు, వసతులు ఉన్న వారి కంటే జీవితం విలువ తెలిసిన అనాథ చిన్నారులే భవిష్యత్‌లో విజయం సాధిస్తారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ జి.జె.సతీష్‌రావు, సర్క్యులేషన్ మేనేజర్ రామిరెడ్డి, కిమ్స్ హాస్పిటల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిమ్స్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ సునీల్ సేపూరి



కమాన్: చిన్నారులను ఉత్సాహపరుస్తున్న నిర్వాహకులు



పాయింట్ నాకా నీకా: బెలూన్ గేమ్‌లో తలపడుతున్న బాలికలు



హమ్మయ్య పడింది: బాస్కెట్‌లోకి బాల్ వేసేందుకు యత్నిస్తున్న చిన్నారులు

ముమ్మాటికి ఇది సర్కారు హత్యే



మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



వీఓఏ మృతికి కారకులైన వారిపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు

డోన్: పొదుపు మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారి ఆర్థికాభివృద్ధికి విశేష కృషిచేసిన వెంకట్రామిరెడ్డిది ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం చేసిన హత్యేనని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు ఆరోపించారు. వెలుగు ప్రాజెక్టులో విలేజ్ ఆర్గనైజ్ అసిస్టెంట్(వీఓఏ)గా పనిచేస్తున్న డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి వెంకట్రామిరెడ్డిని కూటమి నాయకులు, అధికారులు వేధించడంతో ఆయన గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుకున్న మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు తిరునాంపల్లె తిరుమలరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నపూజెర్ల రామచంద్రారెడ్డి, పెద్దపూజెర్ల కమతం భాస్కర్‌రెడ్డి, దొరపల్లె చిరంజీవి, కొచ్చెర్వు మధురెడ్డి, పార్టీ డోన్ పట్టణ అధ్యక్షులు కురుకుంద హరి తదితరులు వెంకట్రామిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌షాప్ డీలర్లను, బుక్ కీపర్లను అక్రమంగా తొలగించేందుకు పోలీసులను సైతం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

రాజకీయాలతో సంబంధం లేని బుక్ కీపర్లను తప్పుడు మార్గాల ద్వారా తొలగిస్తూ వారిని వేధింపులకు గురిచేసి ప్రాణాలు తీసుకునేలా వ్యవహరిస్తున్న వారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు శివరాం, వీఓఏల సంఘం నాయకులు యాపదిన్నె గూండాలు డిమాండ్ చేశారు. గురువారం వారు వెంకట్రామిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు కొత్తబురుజుకు బుగ్గన

వెలుగు వీఓఏ వెంకట్రామిరెడ్డి మృతిపై ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చిన్న విషయాలకు కూడా అధికార కూటమి నాయకులు బూతద్దంలో చూపిస్తూ వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం జరిగే వెంకట్రామిరెడ్డి అంత్యక్రియల్లో తాను పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు.

అవినీతికి కేరాఫ్ వీరభద్ర గౌడ్

- ఇసుక దందా, బెల్టు షాపుల ఏర్పాటుకు రూ.లక్షల్లో వసూళ్లు
- పోలీసుల అండతో పేకాట స్థావరాల ఏర్పాటు
- దోచుకోవడమే పనిగా పెట్టుకున్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్
- వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ అవినీతికి కేరాఫ్‌గా మారి, పనికో రేటు పెట్టి ప్రజలను దోచుకుంటున్నారని వైఎస్సార్ సీపీ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అసెంబ్లీకి వెళ్లకపోవడం దురదృష్టకరమని బుధవారం విలేకరుల సమావేశంలో విమర్శించడంతో గురువారం విరూపాక్షి స్పందించారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2019లో ఇన్‌చార్జ్‌గా ఉన్న వీరభద్ర గౌడ్ చేసిన అవినీతిని ఎండగట్టారు. దోచుకోవడం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. ప్రస్తుతం మరోసారి ప్రజలు ఓడించినా బుద్ధి రాలేదన్నారు. కూటమి అధికారాన్ని అడ్డుపెట్టుని నియోజకవర్గంలో పనికో రేటు పెట్టి రూ.కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా పోలీసులను అడ్డుపెట్టుకుని పేకాట నిర్వహిస్తున్నారన్నారు. అక్రమ రేషన్ రవాణా, డీలర్ షిప్ మార్పులు, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు, వంట ఏజెన్సీల మార్పు కోసం రూ.లక్షలు దోచుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానన్నారు. ఇప్పటికే ఆలూరు అభివృద్ధి, నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ మంత్రి రామా నాయుడుకు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రశ్నిస్తారని తమ నాయకుడికి ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని, అందుకనే తాము అసెంబ్లీకి వెళ్లడం లేదని వివరించారు. ఇకనైనా తనపై వ్యక్తి గత విమర్శలు మానుకుని ఆలూరు అభివృద్ధిపై దృష్టి సారించాలని వీరభద్ర గౌడ్‌కు ఎమ్మెల్యే విరూపాక్షి హితవు పలికారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, మండల కో–కన్వీనర్ వీరేష్ తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణాల్లో చోరీ

- రూ.3.50 లక్షలకు పైగా నగదు అపహరణ

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని మూడు మద్యం దుకాణాల్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎద్దుల మార్కెట్ వద్ద ఉన్న ఆదిలక్ష్మి వైన్ షాప్ రేకుల షెడ్ పైకప్పును కట్ చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు రూ. 2 లక్షలకు పైగా నగదు అపహరించుకెళ్లారు. విశాల్ మార్ట్ సమీపంలోని వివి వైన్ షాప్‌లోనూ అదే మాదిరిగా లోపలికి చొరబడి చోరీకి ప్రయత్నింగా నగదు లేకపోవటంతో వెనుతిరిగినట్లు తెలుస్తోంది. ఆదోని బైపాస్ రోడ్డులోని హేమంత్ వైన్ షాప్ షట్టర్ తీసి అందులో రూ.1.50 లక్షలు నగదును చోరీ చేసినట్లు సమాచారం. గురువారం యజమానులు మద్యం దుకాణాలకు చేరుకోగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సీఐ వి.శ్రీనివాసులు, ఎస్‌ఐ డాక్టర్ నాయక్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. దుకాణాల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

అసంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): అసంక్రమిత వ్యాధులు(బీపీ, షుగర్, క్యాన్సర్) పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. గురువారం నగర శివారులోని ఇ.తాండ్రపాడు గ్రామంలో ఎన్‌సీడీ 3.0 యూనివర్శల్ కామన్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పంచలింగాల గ్రామంలోని ఆరోగ్య క్లినిక్‌ను సందర్శించి అక్కడ ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం ద్వారా నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైపర్‌టెన్షన్(బీపీ), డయాబెటీస్, సాధారణ క్యాన్సర్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, స్క్రీనింగ్‌లో నాణ్యత పాటించడం, సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల డేటా సేకరణ చేయడం, సర్వేను గోప్యతతో నిర్వహించడం, 18 ఏళ్లు పైబడిన మహిళలు, గర్భిణులకు స్క్రీనింగ్‌లో గోప్యత కచ్చితంగా పాటించాలన్నారు. ఇందుకోసం ఇచ్చిన శిక్షణ సామగ్రి, కరపత్రాలు, రేడియో ప్రకటనలను ఉపయోగించాలన్నారు. మొబైల్ డేటాను సరైన సమయంలో కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి అవసరమైన ఆరోగ్య సేవల కోసం సమీప ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే పీఓ హేమలత, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజూషా, జిల్లా ఎపడమాలజిస్టు జి. వేణుగోపాల్ పాల్గొన్నారు.

అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దు

- జిల్లా ఎస్పీ బిందు మాధవ్
- బెంగళూరుకు చెందిన నలుగురు వ్యక్తులు అరెస్టు



కర్ణాటక వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు

కర్నూలు (టౌన్): ప్రజలు అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. సెంట్రల్ ఫండ్ నుంచి రూ.20 కోట్ల నిధులు అప్పుగా ట్రాన్స్‌ఫర్ చేయిస్తామని మోసం చేసిన బెంగళూరుకు చెందిన నలుగురు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక మహీంద్రా రెడ్ కలర్ కారు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 12 గంటల వ్యవధిలోపే నిందితులను అరెస్టు చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు. కాగా కేసు వివరాలను టూటౌన్ సీఐ నాగరాజరావు, ఎస్‌ఐ మోహన్‌కిషోర్ వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సిద్ధవరం గ్రామానికి చెందిన సోమశేఖర్ అనే వ్యక్తికి బెంగళూరుకు చెందిన హరీష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తనకు తాను విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి కంపెనీలతో పరిచయాలు ఉన్నాయని నమ్మించాడు. రూ.20 కోట్ల నిధులు అప్పుగా ఇప్పిస్తామని జీఎస్టీ రూపంలో రూ.15 లక్షలు చెల్లిస్తే చాలని వారికి సూచించారు. అతని మాటలు నమ్మి సోమశేఖర్‌తో పాటు అతని మిత్రుడు బసవరాజు కలిసి కర్నూలులోని రాజ్‌విహార్ సెంటర్ లాడ్జిలో మంతనాలు చేశారు. అయితే వారి మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో రెండవ పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన కర్ణాటకకు చెందిన హరీష్, భానుప్రతాప్, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్ అనే వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుల అరెస్ట్

కోసిగి: మండల పరిధిలోని కడదొడ్డి గ్రామంలో 14 ఏళ్ల బాలికపై అత్యాచార యత్నం కేసుకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ మంజునాథ్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ చంద్రమోహన్‌తో కలిసి ఆయన నిందితుల వివరాలు వెల్లడించారు. గత నెల 30న ఇంటి ఆవరణంలో నిద్రిస్తున్న బాలికపై అదే గ్రామానికి చెందిన బోయ ఉసేని అత్యాచారానికి యత్నించగా అతని స్నేహితులు బోయ వినోద్, బోయ మజ్జిగ సూర్యనారాయణలు కాపలాగా ఉన్నారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను గురువారం ఉరుకుంద క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా నిందితులలో బోయ వినోద్‌పై ఇప్పటికే 8 కేసులు, సూర్యనారాయణపై ఒక కేసు నమోదై ఉండటంతో వీరిపై రౌడీ షీట్ ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు.

కూటమి సర్కారుకు గుణపాఠం తప్పదు

- సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు వంచన
- నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నా పట్టడం లేదు
- ప్రభుత్వంపై సీపీఎం నాయకుల ఆగ్రహం
- ముగిసిన సీపీఎం ప్రజాపోరుయాత్ర



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకరరెడ్డి, పి.నిర్మల, జిల్లా కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్ హెచ్చరించారు. ఊరూరా సూపర్ సిక్స్‌తో భవిష్యత్‌కు భరోసా అంటూ ప్రచారం చేసిన టీడీపీ, జనసేన నాయకులు అధికారంలోకి వచ్చాక వాటి ఊసేత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర ముగింపు సభ గురువారం కలెక్టరేట్ ఎదుట జరిగింది. వందలాదిగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేయాలని నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే టీడీపీ ప్రభుత్వం ప్రజలపై విపరీతమైన భారం మోపుతోందని విమర్శించారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో ఏకంగా ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం వేయడం అన్యాయమన్నారు. ప్రజల ప్రమేయం లేకుండా విద్యుత్ మీటర్లను బిగించి డబ్బు వసూలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుండడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేజీ బియ్యం రూ.80, లీటర్ నూనె రూ.180, కేజీ బ్యాళ్లు రూ.200లకు అమ్ముతున్నారంటే ధరలు ఎంతగా పెరిగాయో ఆలోచన చేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ధరలు తగ్గించాలని ఊరూరా తిరిగిన టీడీపీ నాయకులు ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి పాలనలో అన్నదాతలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పంట పెట్టుబడికి ఇస్తామన్న రూ.20 వేల సాయం ఇప్పటి వరకు అందలేదన్నారు. ఉల్లి రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని, పండించిన పంటను అమ్ముకోలేకపోతున్నారన్నారు. మద్దతు ధర కల్పించి ఆదుకోవడంలో సర్కారు విఫలమైందన్నారు. కర్నూలు నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఉచిత ఇసుక లభ్యం కాక కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. కూటమి పాలనలో రౌడీ రాజ్యం పెరిగిపోవడంతో పాటు ఊరూరా బెల్టు షాపులు వెలిశాయన్నారు. దేవనకొండ మండలంలో యూరేనియం కోసం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత తీవ్రతరమవుతాయని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయశ్రీకి వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.రామకృష్ణ, టి.రాముడు, కేవీ నారాయణ, ఆనంద్‌బాబు, గురుశేఖర్, అలివేలమ్మ, హుస్సేనయ్య, మధు, సాయిబాబా, సుధాకరప్ప, ఎస్ఎండీ షరీఫ్, నరసింహులు, అబ్దుల్లా, రామకృష్ణ, అరుణ, రాఘవేంద్ర పాల్గొన్నారు.